**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**జాతీయ వార్తలు**

**తేది: 26.08.2026** **సమయం. 19.05 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. జాతీయ క్రీడా దినోత్సవం 2026 వేడుకల్లో భాగంగా 'మేరా యువ భారత్' కార్యక్రమాన్ని రేపు దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు.
2. నేపాల్ లోని టిబెట్ సరిహద్దుకు సమీపంలో సంభవించిన ఆకస్మిక వరదలలో గల్లంతైన పలువురు పర్యాటకుల్లో 100 మందికి పైగా భారతీయులు ఉన్నట్టు భావిస్తున్నారు.
3. తెలంగాణలోని సూర్యాపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు మృతి చెందిడం పట్ల ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
4. మిలాద్-ఉన్-నబీ, ఓనం పండగల సందర్భంగా రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

........................................................

## PM-KHELO INDIA DIALOGUE

జాతీయ క్రీడా దినోత్సవం 2026 వేడుకల్లో భాగంగా 'మేరా యువ భారత్' కార్యక్రమాన్ని రేపు దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఖేలో ఇండియా డైలాగ్'ను ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రేపు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తారు. ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలోని ప్రతి జిల్లాలో గల రెండు కళాశాలల యువత ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. దేశ క్రీడా ఆశయాలతో యువత మమేకం కావడానికి ఇదొక మార్గాన్ని అందిస్తుంది. అంతేకాకుండా, దేశ యువజన, క్రీడా వ్యవస్థపై జరిగే చర్చల్లో యువత బాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత యువకులు, MY భారత్

స్వచ్ఛంద కార్యకర్తలు, స్థానిక క్రీడాకారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో చర్చలు జరుపుతారు. యువకులు తమ స్వంత ఆలోచనలు, దృక్పథాలు, ఆకాంక్షలను వ్యక్తపరిచేందుకు ఆహ్వానించే 'యువ సంవాద్' ఈ కార్యక్రమ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. దేశ క్రీడా ప్రయాణంలో యువత భాగస్వామ్యం కావడానికి, వారి ఆకాంక్షలను పంచుకోవడానికి 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు 'ఖేలో ఇండియా డైలాగ్' దోహదపడుతుంది.

....NSD

**FUR REV EVE NEPAL - FLOOD**

టిబెట్ సరిహద్దుకు సమీపంలోని రసువా ప్రాంతంలో భోటే కోషి నదిలో ఈరోజు ఉదయం సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా నేపాల్‌లో గల్లంతైన 384 మంది పర్యాటకుల్లో 100 మందికి పైగా భారతీయులు ఉన్నారు. నేపాల్ టూరిజం బోర్డు — ఎన్‌టిబీ తెలిపిన వివరాల ప్రకారం, గల్లంతైన 384 మంది పర్యాటకుల్లో 291 మంది విదేశీయులు కాగా, 93 మంది నేపాల్ పౌరులు ఉన్నారు. విదేశీయుల్లో 105 మంది భారతీయులు ఉన్నారని ఎన్‌టిబీ తెలిపింది. మిగిలిన వారు యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ తదితర దేశాలకు చెందినవారని పేర్కొంది.

అయితే, ఈ గణాంకాలు ప్రాథమికమైనవేనని, ప్రయాణ సంస్థలు, స్థానిక అధికారులు, ఇతర సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ వివరాలను ప్రస్తుతం ధృవీకరిస్తున్నామని, ఎన్‌టిబీ స్పష్టం చేసింది. భారీ ఆకస్మిక వరదల కారణంగా ఏడుగురు మృతి చెందినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, భూకంపం కారణంగా మంచు చరియలు విరిగిపడి, కరిగిన మంచు భోటే కోషి నదిలోకి భారీగా ప్రవహించడంతో ఈ ఆకస్మిక వరద సంభవించినట్లు తెలుస్తోంది.

....NSD

## PM MODI-NEPAL PM

నేపాల్‌లో వరదల కారణంగా ప్రాణనష్టం సంభవించడంపై ఆదేశ ప్రధానమంత్రి బాలేంద్ర షాతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఫోన్‌లో మాట్లాడి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో నేపాల్‌లోని ప్రజలకు భారతీయులు అండగా నిలుస్తున్నారని ప్రధానమంత్రి  మోదీ సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు.  నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సహాయాన్ని అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు.

....NSD

## BIHAR HIGH ALERT - FLOODS

నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు, గండక్ నదిలో నీటి మట్టం అకస్మాత్తుగా పెరిగే అవకాశం ఉన్నందువల్ల బీహార్ ప్రభుత్వం వరదల ముందస్తు సన్నద్ధతను ముమ్మరం చేసింది. రాష్ట్రంలోని ఆరు జిల్లాలు పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, గోపాల్‌గంజ్, సరన్, ముజఫర్‌పూర్, వైశాలిలలో గండక్ నదీ పరివాహక ప్రాంతంపై ప్రత్యేక నిఘా ఉంచారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సీతామఢి, షెయోహర్, ఇతర జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.

పశ్చిమ చంపారన్‌లోని బగాహా, వైశాలి జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను వీలైనంత త్వరగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు. గండక్ నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున గోపాల్‌గంజ్, బెట్టియాలో NDRF బృందాలను మోహరించారు. ముజఫర్‌పూర్‌లో మరో బృందాన్ని అప్రమత్తంగా ఉంచారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ఒక ఉన్నత స్థాయి బృందాన్ని ఏర్పాటు చేసినట్టు ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తెలిపారు.

ఈ పరిస్థితుల దృష్ట్యా పాట్నాలో బీహార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యయ అమృత్ అధ్యక్షతన ఈ రోజు ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. నిరంతరం నిఘా ఉంచాలని, సహాయక చర్యలకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లు, సీనియర్ పోలీసు అధికారులను ఆదేశించారు.

....NSD

**SHAH- BIHAR**

నేపాల్‌లో కురుస్తున్న భారీ వర్షాలు, హిమానీనదం విచ్ఛిన్నం కారణంగా బీహార్‌లో ఏర్పడిన వరద ముప్పు నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ రోజు బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం తలెత్తిన పరిస్థితిని ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సాధ్యమైనంత సహాయం అందిస్తామని హోం మంత్రి హామీ ఇచ్చారు.

....NSD

**రోడ్డు ప్రమాదం...**

తెలంగాణలోని సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో ఈ ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించారు.వారిలో ఒక పురుషుడు, అయిదుగురు మహిళలు ఉన్నారు. 20 మంది గాయపడ్డారు. వారిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ఆగి ఉన్న కంటైనర్ ను ఢీకొనడంతో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. మృతులు ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలు, విజయవాడకు చెందిన వారిగా గుర్తించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

డెస్క్..పీటీసీ/నల్గొండ

## REV PM-SURYAPET CONDOLENCE

తెలంగాణలోని సూర్యాపేటలో జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం సంభవించడం పట్ల ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఉపరాష్ట్రపతి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ప్రధానమంత్రి మోదీ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

....NSD

## EID MILAD -Un -NABI

ఈద్ మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని దేశంలోని వివిధ ప్రాంతాలలో మతపరమైన భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రవక్త ముహమ్మద్ జీవితం, బోధనలను తెలియజేసే సదస్సులను ఈ సందర్భంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు.

మిలాద్-ఉన్-నబీ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

....NSD

## Onam

ప్రపంచవ్యాప్తంగా ఉన్న మలయాళీలు ఈరోజు ఓనం పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. మలయాళ మొదటి మాసం చింగంలో వచ్చే ఈ పంటల పండుగను కేరళకు బలి చక్రవర్తి రాకకు గుర్తుగా జరుపుకుంటారు. చక్కని పూమాలలు, రంగురంగుల రంగవల్లికలు, ఓనసద్యగా పేర్కొనే రుచికరమైన భోజనం, వల్లంకలి గా పేర్కొనే సర్పిలాకార పడవ పందాలు, కైకొట్టి కళి నృత్యం మొదలైనవన్నీ ఓనం వేడుకల్లో భాగం.

ఓనం పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

......NSD

**PM-JAYANT SINGH**

కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ సింగ్ ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నైపుణ్య పోటీలు, ఫలితాల ఆధారిత ఆర్థిక సహాయం, వ్యవసాయం సహా పలు అంశాలపై ప్రధానమంత్రితో జయంత్ సింగ్  చర్చించారు. సమస్యల పరిష్కారాలు, విధానపరమైన అంశాలపై సృజనాత్మకంగా ఆలోచించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించినట్లు సామాజిక మాధ్యమ వేదికగా జయంత్ సింగ్ తెలిపారు.

......NSD

**BJP-CONGRESS**

మహిళా సాధికారత కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీకి కేవలం ఒక ఎన్నికల నినాదం మాత్రమేనని బీజేపీ విమర్శించింది. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన ఒక పత్రికా సమావేశంలో బీజేపీ నాయకురాలు బాన్సురీ స్వరాజ్ మాట్లాడుతూ, మహిళా సాధికారత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో నారీ శక్తి వందన అధినియమ్‌ను ప్రవేశపెట్టిందని అన్నారు. కాంగ్రెస్ ఈ చట్టాన్ని వ్యతిరేకించి, సభలో దాని ఆమోదాన్ని అడ్డుకుందని ఆమె ఆరోపించారు.

......NSD

**TRIPURA - LEGISLATIVE ASSEMBLY**

త్రిపుర శాసనసభ పదవ విడత సమావేశాలు రేపు ప్రారంభమవుతాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలు ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతాయి.

......NSD

**REV. DELHI LAKSHMI YOJANA**

ఢిల్లీ లక్ష్మి యోజన కింద అర్హులైన 4,000 మంది మహిళా లబ్ధిదారులకు ఢిల్లీ ప్రభుత్వం ఈరోజు ఆమోద పత్రాలను జారీచేసింది. వీటిలో 2,500 పత్రాలను ఒక అధికారిక కార్యక్రమంలో అందజేసింది. ఈ పథకం కింద అర్హులైన మహిళలు ప్రతి నెలా 2,500 రూపాయల ఆర్థిక సహాయం పొందుతారు. మహిళల సంక్షేమం, సాధికారత, గౌరవం దిశగా ఈ చొరవ ఒక ముఖ్యమైన ముందడుగు అని ఈ సందర్భంగా ప్రసంగించిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు అన్నారు.

......NSD

**MIB-NETFLIX SCHOLARSHIP**

భారతీయ కథకుల తర్వాతి తరాన్ని రూపొందించడంలో భాగంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (IICT), నెట్‌ఫ్లిక్స్ సంస్థలు 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ప్రకటించాయి. ఈ స్కాలర్‌షిప్ పథకం కింద, రెండు ఒక సంవత్సరం డిప్లొమా ప్రోగ్రామ్‌లు నాలుగు ఆరు నెలల సర్టిఫికేట్ ప్రోగ్రామ్‌లతో కూడిన ఆరు ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌లలోని విద్యార్థులకు 80 శాతం వరకు ఆర్థిక సహాయం అందిస్తారు.

......NSD

**BISHAL EP-I 26.08.2026**
**BJP-CONGRESS**

BJP has alleged that women’s empowerment is merely an election slogan for the Congress party and its senior leader Rahul Gandhi. Addressing a press conference in New Delhi today, BJP leader Bansuri Swaraj said that the central government had introduced the Nari Shakti Vandan Adhiniyam in the Lok Sabha with the objective of empowering women. She alleged that the Congress opposed the legislation and obstructed its passage in the House.